


WWW.GAYATHRINEWS.COM

APTEL/26/A3646

# గాయత్రి న్యూస్

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ బుధవారం 27-05-2026 సంపుటి : 1 సంచిక :03 ఎడిటర్ : యం నాగేశ్వరరావు పేజీలు : 4 వెల రు : 2/-

## గోదావరిలోకి పరిశ్రమ వ్యర్థాలు..

### డిప్యూటీ సీఎం పవన్ ఆగ్రహం





పవిత్ర గోదావరిలో కాలుష్య నివారణకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రంగంలోకి దిగారు. తూర్పుగోదావరి జిల్లాలో రెండో రోజు పర్యటనలో భాగంగా వెంకటనగరం వద్ద ఆంధ్రాపేపర్ మిల్స్ కాలుష్య వ్యర్థాలు గోదావరిలో కలిసే ప్రాంతాన్ని పరిశీలించారు.

పరిశ్రమ వ్యర్థాలు నేరుగా గోదావరిలో కలుస్తుండటంపై డిప్యూటీ సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. కలుషిత నీటి నమూనాలను సేకరించి పరీక్షలకు పంపాలని అధికారులను ఆదేశించారు. వెంటనే నివారణ చర్యలు తీసుకోవాలని, ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. గోదావరి కాలుష్య నివారణకు టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తున్నట్టు పవన్ ఇప్పటికే ప్రకటించారు. డిప్యూటీ సీఎం వెంట మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్, స్థానిక ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తదితరులు ఉన్నారు.

## ట్రంప్ 'అబ్రహం అకార్డ్స్' మెలిక.. అడకత్తెరలో పాకిస్థాన్



అమెరికా-ఇరాన్ మధ్య శాంతి ఒప్పందానికి మధ్యవర్తిత్వం వహిస్తున్నామంటూ గొప్పలు చెబుతోన్న పాక్ పరిస్థితి ట్రంప్ ప్రతిపాదనతో ఇప్పుడు కుడితిలో పడిన ఎలుకలా మారింది. ఈ శాంతి ఒప్పందానికి 'అబ్రహం అకార్డ్స్ ' మెలికపెట్టిన అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్..

## ఏపీ పోలీసులు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదు



- తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్‌ను ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్ కలిశారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. సామాజిక మాధ్యమాల్లో తనపై చేస్తున్న దుష్ప్రచారంపై చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరినట్లు తెలిపారు.

## రూ.వెయ్యి కోట్ల స్కామ్.. ప్రభుత్వ భూములు ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టారు:




రూ.వెయ్యి కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేశారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. శంషాబాద్ మండలం పెద్దషాపూర్‌లో 170 ఎకరాల భూమి ప్రభుత్వానికి చెందినదని ఆర్డీవో పేర్కొన్న నాలుగు రోజుల వ్యవధిలో అక్కడి తహసీల్దార్ పట్టా భూమిగా ఆదేశాలు ఇచ్చారని చెప్పారు.

## దేశంలోకి చొరబాట్లు..అక్రమ వలసదారులపై ఉన్నతస్థాయి కమిటీ




అక్రమ వలసలు, ఇతర కారణాల వల్ల దేశంలో చోటుచేసుకుంటున్న అసహజ జనాభా మార్పుల ను నియంత్రించేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటోంది. దీనిపై దర్యాప్తు జరిపేందుకు ఓ ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు.

కమిటీకి రిటైర్డ్ జడ్జి జస్టిస్ ప్రకాష్ ప్రభాకర్ నావోలేకర్ అధ్యక్షత వహిస్తారని.. మాజీ ఐఏఎస్ అధికారి దుర్గా శంకర్ మిశ్రా, మాజీ ఐపీఎస్ అధికారి బాలాజీ శ్రీవాస్తవ, ఆర్థికవేత్త డాక్టర్ షమికా రవి సభ్యులుగా ఉంటారని అమిత్‌షా తెలిపారు.

## మహిళా సూపర్ బజార్లు



"మహిళలు స్వశక్తితో నిర్వహిస్తున్న వ్యాపారాలను వారి సొంత భవనాల నుంచే కొనసాగించేందుకు 8,000 భవనాలను ఒకే రోజు, ఒకే సమయంలో ప్రారంభించుకునే అద్భుత కార్యక్రమమిది. ఇది దేశంలోనే సంచలనం. మహిళా సంఘాలకు సొంత భవనాలు ఉండటం అంటే సమావేశాలకు స్థలం ఇవ్వడం మాత్రమే కాదు.

- తొలి దశలో 119 ఏర్పాటుకు స్థలాలు కేటాయిస్తాం
స్వయం సహాయక సంఘాలకు రైస్ మిల్లులు, లాజిస్టిక్స్ హబ్‌లు, గోదాముల నిర్మాణ బాధ్యత
వారికి నామమాత్రపు లీజుతో వంద ఎకరాల వరకైనా అప్పగిస్తాం
అతివల అండతో మళ్లీ అధికారంలోకి వస్తాం
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు ఉండాలి
- రాజమహేంద్రిలో అధికారులతో పవన్ సమీక్ష
8,000 గ్రామ మహిళా సంఘాల భవనాలకు వర్చువల్‌గా శంకుస్థాపన

## వెలుగుమట్ల భూ నిర్వాసితులకు న్యాయం చేయాలి: కవిత



## ఏపీ వైద్యారోగ్యశాఖలో భారీగా బదిలీలు.. డీఎంఈగా విష్ణువర్ధన్

- రాష్ట్రవ్యాప్తంగా నలుగురు కొత్త ప్రిన్సిపల్స్, తొమ్మిది మంది సూపరింటెండెంట్‌ల నియామకం చేపట్టింది. డీఎంఈ కార్యాలయంలో అదనపు డీఎంఈగా డా.సత్యనారాయణమూర్తిని నియమించింది.

## వెళ్లగొట్టకముందే పారిపోండి: అక్రమ వలసదారులకు సువేందు హెచ్చరిక



ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన విధంగానే బెంగాల్‌లోని అక్రమవలసదారుల పై సువేందు ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. బంగ్లాదేశీయులను వారి స్వదేశానికి పంపేయడానికి చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో సీఎం బెంగాల్ సీఎం సువేందు అధికారి చొరబాటుదారులకు తీవ్ర హెచ్చరికలు చేశారు.

## జగన్ కుటుంబ రాజకీయాలన్నీ రక్త మాంసాలతో నిండినవే

- జగన్ కుటుంబ రాజకీయాలన్నీ రక్త మాంసాలతో నిండినవేనని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి



# సంకల్ప స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో విజయవంతమైన బాక్స్ క్రికెట్ టోర్నమెంట్

**– స్పాన్సర్స్ "రవికుమార్ మురళి నాయుడు ప్రోత్సాహంతో విజయవంతమైన సీజన్-2"**

**– "పీసీ పెంచల్ కుమార్ స్పాన్సర్ చేసిన విన్నర్ కప్ ప్రత్యేక ఆకర్షణ"**




**శ్రీకాళహస్తి, మే 26,గాయత్రి న్యూస్ :రిపోర్టర్ : రంజిత్**

మురళి నాయక్ జ్ఞాపకార్థం "మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ సీజన్-2" విజయవంతందేశం కోసం చిన్న వయసులోనే ప్రాణత్యాగం చేసిన వీర జవాన్ మురళి నాయక్ జ్ఞాపకార్థం నిర్వహించిన "మురళి నాయక్ మెమోరియల్ బాక్స్ క్రికెట్ టోర్నమెంట్ సీజన్-2" విజయవంతంగా ముగిసింది. సంకల్ప స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టోర్నమెంట్ యువతలో దేశభక్తి, క్రీడాస్ఫూర్తిని పెంపొందించే లక్ష్యంతో ఘనంగా నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 30 జట్లు పాల్గొని పోటాపోటీగా తలపడ్డాయి.టోర్నమెంట్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచిన చీత సిక్సర్స్ జట్టు విజేతగా నిలిచింది. నో బాల్ లెజెండ్స్ జట్టు రన్నర్స్‌గా నిలవగా, విజేతలకు రూ.10,000 నగదు బహుమతి మరియు ట్రోఫీ, రన్నర్స్‌కు రూ.5,000 నగదు బహుమతి మరియు కప్పును స్పాన్సర్లు అందజేశారు.ఈ టోర్నమెంట్‌కు ప్రముఖ హైకోర్టు అడ్వకేట్ రవికుమార్, క్రీడా ప్రోత్సాహకుడు మురళి నాయుడు ప్రధాన స్పాన్సర్లుగా వ్యవహరించగా, " విన్నర్ టీంకు పీసీ పెంచల్ కుమార్ కప్పును స్పాన్సర్ చేశారు"వీరి సహకారంతోనే టోర్నమెంట్ విజయవంతంగా పూర్తయిందని నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా హైకోర్టు అడ్వకేట్ రవికుమార్ మరియు మురళి నాయుడు మాట్లాడుతూ... చిన్న వయసులోనే దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మురళి నాయక్ త్యాగాన్ని ఎప్పటికీ మరవకూడదన్నారు. ఆయన దేశసేవ యువతకు స్ఫూర్తిదాయకమని, ప్రతి సంవత్సరం ఆయన జ్ఞాపకార్థం ఇలాంటి క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహిస్తూ యువతలో దేశభక్తిని పెంపొందిస్తామని తెలిపారు. యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకుని శారీరక దృఢత్వంతో దేశానికి సేవ చేసే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు.టోర్నమెంట్‌లో బెస్ట్ బ్యాట్స్‌మన్, బెస్ట్ బౌలర్, ఎంవీపీ, బెస్ట్ టీం, ఫెయిర్ ప్లే అవార్డులను కూడా క్రీడాకారులకు అందజేశారు. పీఈటీ మాస్టర్ కిషోర్ ప్రత్యేక అతిథిగా హాజరై తన చేతుల మీదుగా కొన్ని ప్రైజ్ మనీలను పంపిణీ చేశారు. క్రీడలను ప్రోత్సహిస్తూ పాల్గొన్న క్రీడాకారులను అభినందించారు.ఈ టోర్నమెంట్‌ను రంజిత్ కుమార్ మరియు బాలాజీ సమర్థవంతంగా నిర్వహించగా, సంకల్ప స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో యువతకు ఆదర్శంగా నిలిచే విధంగా కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. మురళి నాయక్ చేసిన త్యాగాన్ని యువత ఎప్పటికీ మర్చిపోకుండా ప్రతి సీజన్‌లో ఆయన జ్ఞాపకార్థం టోర్నమెంట్ నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

# యువత భవిష్యత్తుతో ఆడుకున్న జగన్‌ను ప్రజలు క్షమించరు

**శ్రీకాళహస్తి, మే 26,గాయత్రి న్యూస్ :రిపోర్టర్ : రంజిత్**

మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డిపై శ్రీకాళహస్తి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రజలకు అద్భుత సంక్షేమం అందిస్తానని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి, నిరుద్యోగులు మరియు ఉద్యోగ వర్గాల ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. మెగా డీఎస్సీ ద్వారా 16 వేల టీచర్ పోస్టులను పారదర్శకంగా భర్తీ చేసిన ఎన్డీయే కూటమి ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తూ ఎంపికైన అభ్యర్థులను అవమానిస్తున్నారని మండిపడ్డారు.మెగా డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు కష్టపడి చదివి ప్రతిభతో ఎంపికయ్యారని, వారిపై అనుమానాలు వ్యక్తం చేసిన జగన్ రెడ్డి వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 16 వేల పోస్టులు భర్తీ చేయడమే కాకుండా మరో 10 వేల పోస్టులతో జాబ్ క్యాలెండర్ విడుదల చేసి నిరుద్యోగ యువతకు భరోసా కల్పించిన ప్రభుత్వం ఎన్డీయే కూటమిదేనని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మెగా డీఎస్సీ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేశారని కొనియాడారు. అయితే దీనిని చూసి ఓర్వలేక జగన్ రెడ్డి చౌకబారు విమర్శలు చేస్తున్నాడని ఆరోపించారు.వైసీపీ పాలనలో ఐదేళ్ల పాటు ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయలేదని, జాబ్ క్యాలెండర్ ఇవ్వకుండా నిరుద్యోగ యువతను మోసం చేశారని విమర్శించారు. మెగా డీఎస్సీని అడ్డుకునేందుకు కోర్టుల్లో కేసులు వేయడం ద్వారా రాష్ట్రానికి పెట్టుబడులు, యువతకు ఉద్యోగ అవకాశాలు రాకుండా ప్రయత్నించారని ఆరోపించారు.ఈ




కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా. యం. ఉమేష్ రావు, శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు గాదిపాకుల గోపీనాథ్, బీమాల భాస్కర్, వజ్రం కిషోర్, అద్దంకి కిట్టు, కోట చంద్రశేఖర్, గంగనపల్లి రమేష్, సులేమాన్, కృష్ణమూర్తి, తుపాకుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# రెవిన్యూ అంశాలపై జూమ్ కాన్ఫరెన్స్

**– రాష్ట్ర కలెక్టర్లు, జిల్లా రెవిన్యూ అధికారులతో భూ పరిపాలన రాష్ట్ర ప్రధాన కమిషనర్ జయలక్ష్మి**

**గాయత్రి న్యూస్ ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్**

ఏలూరు జిల్లాలో 22ఏ భూ సమస్యల కింద అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల మేరకు పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి రాష్ట్ర భూపరిపాలన ప్రధాన కమిషనర్ జి.జయలక్ష్మి కి తెలిపారు. రాష్ట్ర సచివాలయం నుండి 22ఏ భూ సమస్యల పరిష్కారం, రీ సర్వే, పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ, రెవిన్యూ రికార్డుల డిజిటలైజేషన్, ఐవిఆర్ఎస్ సర్వే , తదితర అంశాలపై సిసిఎల్ఏ జయలక్ష్మి రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లు, రెవిన్యూ అధికారులతో మంగళవారం జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సిసిఎల్ఏ జయలక్ష్మి మాట్లాడుతూ 22ఏ భూ



సమస్యల పరిష్కారంలో నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించిన భూములకు సంబంధించి ఉన్న మార్గదర్శకాలను, కాలానుగుణంగా జారీచేసిన ప్రభుత్వ ఉత్తర్వులను క్షుణ్ణంగా పరిశీలించి అర్జీలను పరిష్కరించాలన్నారు. పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీకి సంబంధించి మే నెలలో నిర్దేశించిన మేర పంపిణీ చేయాలనీ, జూన్, నెలలో పంపిణీ చేయవలసిన పట్టాదార్ పాస్ పుస్తకాలకు సంబంధించి రైతుల వివరాలు, విస్తీర్ణం, తదితర అంశాలపై సమాచారం సిద్ధం చేసుకుని, పట్టాదార్ పాస్ పుస్తకాల ప్రచురణకు ముందు వివరాలను సరిచూసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో మే నెలలో 7701 పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ లక్ష్యానికి గాను, 7701 కు పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ చేసి నూరు శాతం లక్ష్యాలను సాధించామన్నారు. 22 ఏ భూ సమస్యలకు సంబంధించి 341 దరఖాస్తులు అందాయని వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి 75 దరఖాస్తులను ఆమోదించడం జరిగిందని, నిబంధనల మేరకు లేని 75 దరఖాస్తులను తిరస్కరించామని, 191 పెండింగ్ లో ఉన్నాయని, వాటిని క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల మేరకు ఉన్న ధరఖాస్తులను పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు.జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ, ఇంచార్జ్ డిఆర్ఓ దేవకీదేవి, నూజివీడు సబ్ కలెక్టర్, ఏలూరు, జంగారెడ్డిగూడెం ఆర్డీఓ లు కిషోర్, రమణ, తహసీల్దార్లు, ప్రభృతులు పాల్గొన్నారు.

# ఘనంగా టిడిపి మహానాడు

**– పిలుపునిచ్చిన పోలవరం నియోజకవర్గ అబ్జర్వర్ కోళ్ల నాగేశ్వరరావు**



**గాయత్రి న్యూస్ ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్**

టిడిపి వ్యవస్థాపకులు,మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు జయంతిని పురస్కరించుకుని జరుగనున్న "మహానాడు"వేడుకలు ఒక విశేషమైతే,యువ నాయకులు నారా లోకేష్ బాబు పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత జరిగే మొదటి మహానాడు గా మరో విశేషం కావున వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, పోలవరం నియోజకవర్గ అబ్జర్వర్ కోళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.అయితే సీఎం చంద్రబాబు నాయుడు,నారా లోకేష్ ఆదేశాల ప్రకారం భారీ ఖర్చుతో కాకుండా పోలవరం నియోజకవర్గంలోని 10 క్లస్టర్ల పరిధిలో సాధారణంగా జరపాలని నిశ్చయించడం జరిగిందన్నారు .టిడిపి కుక్కునూరు మండల అధ్యక్షులు ములిశెట్టి నాగేశ్వరరావు (నాగు)గృహంలో ట్రై కార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులుతో కలిసి పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు.అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి తెలుగుదేశం లోనే ఉంటూ పార్టీ, నాయకులు,కార్యకర్తల అభివృద్ధి కి కృషి చేస్తున్న నాగుకు రెండవసారి పార్టీ మండల అధ్యక్ష పదవి దక్కడం అభినందనీయం అన్నారు. సీనియర్ల కృషి మరువలేనిది: ట్రైకార్ ఛైర్మన్ బొరగం 2014 నుంచి ఆంధ్రాలో కలిపిన దగ్గర నుంచి కుక్కునూరు, వేలేరుపాడు మండలాల పార్టీ లోని సీనియర్ నాయకులైన కోటగిరి సత్యనారాయణ, పులి శ్రీనివాసరావు, చుంచు సత్యనారాయణ,మాజీ ఉపసర్పంచ్ లు పార్టీకి చేస్తున్న సేవలు మరువలేనివని కొనియాడారు.అధిక ఖర్చులతో కాకుండా పార్టీ సీనియర్లు, అంకితభావం కలిగిన నాయకులు కార్యకర్తలు కోసమైనా మహానాడు వేడుకలను ఉన్నంతలో ఘనంగా నిర్వహించాలని సీఎం చంద్రబాబు, రాష్ట్ర మంత్రి లోకేష్ బాబు ఆదేశాల ప్రకారం జరపాలని సూచించారు.ఈ సమావేశంలో రమణరాజు,ఉదయ్, టౌన్ ప్రెసిడెంట్ హరిబాబు, నరేశ్, నరుకుళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోలు ధరల పెంపు అన్యాయం




**శ్రీకాళహస్తి, మే 26, గాయత్రి న్యూస్, : రిపోర్టర్ : మునిరత్నం**

పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలను వరుసగా పెంచుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం సామాన్యులు, మధ్యతరగతి ప్రజల నడ్డి విరుస్తోందని సిపిఎం శ్రీకాళహస్తి ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి విమర్శించారు. పెంచిన ధరలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలిపారు. నాలుగోసారి మళ్లీ లీటరుపై రూ.2.86 చొప్పున చమురు ధరలను పెంచి పేద, మధ్య తరగతి ప్రజానీకంపై పెనుభారం వేయడం గర్హనీయమన్నారు. దఫదఫాలుగా భారాలు వేస్తుండడంతో నిత్య జీవితావసరాల ధరలు పెరిగి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. మరోవైపు చమురుపై రాష్ట్ర ప్రభుత్వం టాక్స్‌లు తగ్గించడం లేదని చెప్పారు. ఇష్టానుసారం ధరలు పెంచి దోచుకుంటున్న ప్రైవేట్ ఆయిల్ కంపెనీలకు ముకుతాడు వేయాలే కానీ అదానీ, అంబానీలకు, అమెరికా ఆయిల్ కంపెనీలకు లొంగిపోయిన ప్రభుత్వం ఆ భారాన్ని ప్రజలపై వేస్తున్నదని మండిపడ్డారు. ఇరాన్, రష్యా మన దేశ కరెన్సీలోనే ముడి చమురును తక్కువకే ఇస్తామని చెబుతున్నా మోడీ ట్రంప్ కు సాగిలపడటం అన్యాయమన్నారు. పరిస్థితి ఇలానే కొనసాగితే దేశంలో పెట్రో ఉద్యమం తప్పదన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి అంగేరి పుల్లయ్య, పెనగడం గురవయ్య, రమణయ్య, గురునాథం, రాధమ్మ, వెలివేంద్రం, రాజా తదితరులు పాల్గొన్నారు.

# పబ్లిక్ కొళాయిలు కొనసాగించాలి




**శ్రీకాళహస్తి, మే 26, గాయత్రి న్యూస్: రిపోర్టర్ : మునిరత్నం**

శ్రీకాళహస్తి మున్సిపాలిటీ పరిధిలో పేదల మంచినీటి అవసరాలు తీరుస్తున్న పబ్లిక్ కొళాయిలను కొనసాగించాలని సీపీఎం శ్రీకాళహస్తి ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. పేదల పట్ల మున్సిపల్ కమిషనర్ తీరు ఆక్షేపనీయమన్నారు. మొన్న పన్నుల వసూళ్ల పేరిట పేదల నివాస ప్రాంతాలకు మంచినీటి సరఫరాను నిలేపేసిన కమిషనర్, తాజాగా వృధా పేరిట పబ్లిక్ కొళాయిలను తొలగించడం సహేతుకం కాదన్నారు. పట్టణంలో 20 శాతం ప్రజలు పబ్లిక్ కొళాయిల ద్వారా తమ నిత్యావసరాలు తీర్చుకుంటున్నారని గుర్తు చేశారు. తక్షణమే పబ్లిక్ కొళాయిలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నాయకులు అంగేరి పుల్లయ్య, పెనగడం గురవయ్య, గురునాథం, రమణయ్య, ఈశ్వరయ్య, కుమార్, రాజా, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక ప్రకృతి వ్యవసాయ కార్యక్రమం



**గాయత్రి న్యూస్ ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్**

బుట్టాయిగూడెం మండలంలోని ముకినవారిగూడెం గ్రామం ఐటిడిఏ కె.ఆర్.పురం పరిధిలో రైతుసాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక ప్రకృతి వ్యవసాయ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డా. బాబూరావు నాయుడు, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ బి. వెంకటేష్ నాయకత్వంలో నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ కార్యకలాపాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులు అమలు చేస్తున్న ఏ-గ్రేడ్ మోడల్స్, ఏటీఎం మోడల్స్ ను సందర్శించి వాటి ప్రయోజనాలు, ఆదాయ అవకాశాలపై రైతులతో చర్చించారు. అలాగే ద్రవ జీవామృతం, ఘన జీవామృతం, సీడ్ పెలెట్స్ తయారీ ప్రదర్శనలను పరిశీలించి రైతులు రసాయన ఎరువులకు పూర్తిగా దూరంగా ఉండి ప్రకృతి వ్యవసాయాన్ని మరింత విస్తరించాలని సూచించారు. ఈ సందర్భంగా 50 మంది రైతులకు పీఎం డిఎస్ కిట్లు పంపిణీ చేయగా, పిఎం డిఎస్ విధానం ద్వారా తక్కువ నీటితో సంవత్సరం పొడవునా పంటలు సాగు చేయవచ్చని వివరించారు. అనంతరం బుట్టాయిగూడెంలోని నూతన ఏపిసిఎన్ ఎఫ్ డివిజనల్ కార్యాలయాన్ని సందర్శించి నిర్వహించిన అవగాహన సమావేశంలో ప్రకృతి వ్యవసాయం మానవ ఆరోగ్యం, భూసార పరిరక్షణకు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎం బి. వెంకటేష్, ఎన్ఎఫ్ఏ హుస్సేన్, ప్రకృతి వ్యవసాయ రైతులు,ఏపీసీఎన్ఎఫ్ కేడర్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గివింగ్ హాండ్స్ ఫౌండేషన్‌కు జాతీయ స్థాయిలో గౌరవం



**శ్రీకాళహస్తి, మే 26, గాయత్రి న్యూస్: రిపోర్టర్ : మునిరత్నం**
ఎంవీ రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన "ఆది దంపతుల జాతీయ పురస్కారాలు--2026" కార్యక్రమం సేవా స్ఫూర్తి, సామాజిక బాధ్యత, సాంస్కృతిక వైభవాలకు ప్రతీకగా ఘనంగా జరిగింది. ఈ వేదికకు మూడు రాష్ట్రాల నుండి సేవామూర్తులు, కళాకారులు, విద్యావేత్తలు, సామాజిక కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. సామాజిక సేవ, విద్య, వైద్యం, జర్నలిజం, కళారంగం తదితర విభాగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న సేవామూర్తులకు ప్రముఖుల చేతుల మీదుగా "ఆది దంపతుల జాతీయ పురస్కారాలు--2026" ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గివింగ్ హాండ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, ఎడ్యుకేషనల్ సైకాలజిస్ట్ డాక్టర్ ఎం. వరలక్ష్మి కి, విద్యార్థుల మానసిక వికాసం కోసం కళాధారిత విద్యా విధానాలతో విశిష్ట సేవలు అందించినందుకు "ఉత్తమ ఉపాధ్యాయిని ఆది దంపతుల జాతీయ పురస్కారం" అందజేశారు. అలాగే చిన్న వయసులోనే సేవా కార్యక్రమాల్లో ముందుండి, గివింగ్ హాండ్స్ ఫౌండేషన్ ఆశ్రమం ద్వారా నిరాదరణకు గురైన 25 మంది నిరాశ్రయ వృద్ధులకు తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలోని బంగారమ్మ గుడి వద్ద ఉచిత భోజన, వైద్య సదుపాయాలతో ఆశ్రయం కల్పిస్తూ సేవలందిస్తున్న ఫౌండేషన్ ప్రెసిడెంట్ సాయి దీపికను "ఉత్తమ సేవాస్ఫూర్తి ప్రదాత ఆది దంపతుల జాతీయ పురస్కారం"తో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జబర్దస్త్ ఆర్టిస్ట్ దామోదరం మరియు వారి బృందం, ఎంవీ రావు ఫౌండేషన్ సభ్యులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. గివింగ్ హాండ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ ఎం. వరలక్ష్మికి, ప్రెసిడెంట్ సాయి దీపిక కి జాతీయ స్థాయి పురస్కారాలు రావడం పట్ల ఆశ్రమంలోని వృద్ధులు హర్షం వ్యక్తం చేశారు.

# మహానాడుకు యువత భారీగా తరలిరావాలి -పవన్ నాయుడు

**తొట్టంబేడు, మే 26,గాయత్రి న్యూస్ :రిపోర్టర్ : రంజిత్**



తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే "మహానాడు" కార్యక్రమానికి కార్యకర్తలు, యువత భారీగా తరలిరావాలని తొట్టంబేడు మండల తెలుగు యువత అధ్యక్షుడు పవన్ నాయుడు పిలుపునిచ్చారు. మే 27 నుంచి 29 వరకు జరిగే మహానాడుకు తొట్టంబేడు మండలం నుంచి టీడీపీ శ్రేణులు, యువత పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు.మహానాడు వేదికగా పార్టీ విధానాలు, భవిష్యత్ కార్యాచరణపై కీలక చర్చలు జరుగుతాయని తెలిపారు. యువత పార్టీ బలోపేతంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా నిర్వహించే ఈ కార్యక్రమంలో పాల్గొని పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.ప్రతి సంవత్సరం మే 27 నుంచి 29 వరకు నిర్వహించే మహానాడు కార్యక్రమంలో పార్టీ తీర్మానాలు, భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తారని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరవుతారని పవన్ నాయుడు పేర్కొన్నారు.

# మత్తుకు దూరంగా ఉండాలి - డి.ఎస్.పి హెచ్చరిక




**శ్రీకాళహస్తి రూరల్, మే 26, గాయత్రి న్యూస్ : రిపోర్టర్ : మునిరత్నం**
శ్రీకాళహస్తి మండలంలోని చల్లపాలెం బీసీ కాలనీలో మాదక ద్రవ్యాల వినియోగంపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అనుమానితుల వద్ద నుండి శాంపిల్స్ సేకరించి టెస్టులు నిర్వహించారు. ఈ ప్రత్యేక డ్రైవ్ లో మొత్తం 32 మందికి పరీక్షలు నిర్వహించగా, ముగ్గురికి పాజిటివ్‌గా తేలినట్లు పోలీసులు తెలిపారు. గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాల వినియోగం ఆరోగ్యాన్ని దెబ్బతీయడమే కాకుండా నేరాలకు దారితీస్తుందని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి రూరల్ సీఐ ఇబ్రహీం, ఎస్సై వెంకటేష్, మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మంత్రి మల్లాడిని కలిసిన లయన్ రాధా సరస్వతి మెట్ట

**- లైన్స్ క్లబ్ ద్వితీయ ఉప జిల్లా గవర్నర్ అభ్యర్థిగా పోటీ**

గాయత్రి న్యూస్
ఈనెల 31వ తేదీన రాజమండ్రిలో జరిగే లైన్స్ క్లబ్ ద్వితీయ ఉప జల్లా గవర్నర్ పదవికి త్రిముఖ పోటీ ఉండగా లయన్ రాధా సరస్వతి మెట్టకు అనుకూలంగా మారింది. ఇటీవల యానం ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి పదవి నీ కైవసం చేసుకున్న మంత్రి మల్లాడి కృష్ణారావును మంగళవారం ఉదయం యానాం క్యాంపు కార్యాలయంలో లయన్ రాధా సరస్వతి కలిసి ఓట్లు అభ్యర్థించారు. యానం లైన్స్ క్లబ్ లో మొదటి నుండి సభ్యత్వం ఉన్న మంత్రి మల్లాడి కృష్ణారావును కలిసి తన మద్దతును ప్రకటించాలని రాధా సరస్వతి కోరారు. లయన్స్ ఇంటర్నేషనల్ లైన్స్ క్లబ్ కాకినాడ సంకల్ప్ జోన్ టు లో కొనసాగుతున్న రాధా సరస్వతి ఈనెల 31వ తేదీన రాజమండ్రిలో జరిగే ద్వితీయ ఉప జల్లా గవర్నర్ పదవికి పోటీ చేస్తున్నారు. తన ప్రచారంలో భాగంగా క్లబ్ సభ్యులందరినీ కలుస్తూ తన అభ్యర్థితత్వాన్ని బలపరచాలని



కోరుకుంటున్నారు. ఈ ఏడాదిలో జిల్లా మెంబర్షిప్ కో-ఆర్డినేటర్ గా ఉండి రికార్డు స్థాయిలో 18 క్లబ్ లలో 900మెంబర్షిప్పులను రాధా సరస్వతి చేయించారు. ప్రపంచవ్యాప్తంగా లైన్స్ క్లబ్ 1.5 మిలియన్స్ లక్ష్యంగా అన్ని క్లబ్లు పనిచేయడం జరుగుతున్నాయని, ప్రపంచవ్యాప్తంగా 55వేల క్లబ్లు ఉన్నాయన్నారు. అనేక డిగ్రీ అర్హతలతో కాకినాడ స్కిన్ సెంటర్ డైరెక్టర్ గా, కేసి మెడికల్స్ ఆంధ్రప్రదేశ్ లో తొలి ఇంటర్నేషనల్ బ్యూటీ ఇనిస్టూట్ స్థాపించారు. కుటుంబ నేపథ్యమంతా డాక్టర్లతో ఉండటం భర్త లయన్ మెట్ట వెంకటేష్ ప్రముఖ సీనియర్ డెర్మటాలజిస్ట్, కుమారుడు లయన్ మెట్ట విపుల్ సిటీ సర్జన్, కోడలు లయన్ శ్రావ్య డెర్మటాలజీ పీజీ మరియు మెట్ట వెంకటేష్ ప్రతి సంవత్సరం కళ్ళజోళ్ళ ప్రాజెక్టుకు 60వేల రూపాయలు విరాళం ఇవ్వడం జరుగుతుంది. అంతేకాకుండా ప్రతిష్ఠాత్మక 13 అవార్డులను రాధా సరస్వతి సాధించారు.రాధా సరస్వతి అజెండా... సేవే మా మొదటి ప్రాధాన్యత, ప్రతి క్లబ్లో సభ్యులను పెంపు, యువతకు నాయకత్వ అవకాశాలు, మహిళలకు మరింత ప్రోత్సాహం, బలమైన, చురుకైన క్లబ్బులు, పారదర్శకమైన వ్యవస్థ, కలిసి ముందుకు సాగుదాం, ప్రతి లయన్ కు శిక్షణ, ప్రేరణ, ప్రపంచ సేవలలో జిల్లా ముందుండాలి, సంప్రదాయాన్ని కాపాడుతూ మార్పు తీసుకురావాలనే అజెండతో ఈ ఎన్నికలలో ముందుకెళ్లడం జరుగుతుందని లయన్ రాధా సరస్వతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ చైర్ పర్సన్ రాజీ పున్నంరాజు, జిల్లా గెస్ట్ లావణ్య సమయమంత్రి, శ్రీకారం క్లబ్ ప్రెసిడెంట్ వినీత, మాలతీ మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# రైతాంగ సమస్యలపై ఉద్యమాలు చేయాలి

**- ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య**

గాయత్రి న్యూస్
రైతాంగ సమస్యలపై విస్తృతంగా ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య పిలుపునిచ్చారు. ఏపీ రైతు సంఘం ఎన్టీఆర్ జిల్లా 46వ మహాసభలు స్థానిక శ్రీ సాయిబాబా కళ్యాణ మండపంలో మంగళవారం జరిగింది. ముందుగా రైతు సంఘం సీనియర్ నాయకులు సానికొమ్ము నాగేశ్వర్ రెడ్డి రైతు సంఘం జెండాను ఆవిష్కరించారు. రై సంఘం జిల్లా అధ్యక్షులు మద్ది రెడ్డి వెంకట్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఎం చంద్రశేఖర్ అధ్యక్షతన మహాసభ ప్రారంభమైంది. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన వి కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం గ్లోబల్ ప్రసారం చేస్తూ రైతాంగ సమస్యలను పట్టించుకోవడంలేదని విమర్శించారు. రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో పెట్టిన పెట్టుబడులు రాక రైతులు అప్పుల ఊబిలో కూరుకు పోయారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో రైతులతో సంబంధం లేకుండా అభివృద్ధి పేరుతో వ్యవసాయ భూములను పెట్టుబడిదారులకు ధారాధత్వం చేస్తున్నారని అన్నారు. అన్నం పెట్టే రైతు ఉరి తాళ్ళకు వేలాడుతున్నారని కూటమి ప్రభుత్వం రైతుల చావులతో ఆటలాడుతుందని రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా రైతుల పక్షాన ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, తారకరామా ఎత్తిపోతల పథకం , చింతలపూడి ఎత్తిపోతల పథకాన్నిపూర్తి చేయాలని, జిల్లాలో చెరువులన్నీ ఆధునికరించి రైతులకు నీళ్లు అందుబాటులో తీసుకురావాలని, పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలని, పోలంపల్లి డ్యాం నిర్మాణం చేపట్టాలని, ఈ మహాసభ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వై కేశవరావు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పివి ఆంజనేయులు, రైతు సంఘం రాష్ట్ర నాయకులు వజ్రాల ధనలక్ష్మి, సిఐటియు





జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ సి హెచ్ శ్రీనివాస్, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గువ్వల సీతారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పి ఆనంద్ రావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కే గోపాల్, సిహెచ్ సుధాకర్, రైతు సంఘం మైలవరం మండల అధ్యక్ష కార్యదర్శులు వి వెంకటరెడ్డి, ఆర్ సుబ్బారావు, రైతు సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# మైలవరం ఎసిపి వై ప్రసాద్ రావు ని వెంటనే సస్పెండ్ చేయాలని

**- ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి , నాయకులు డిమాండ్**

గాయత్రి న్యూస్
దళితుల పట్ల మాదిగల పట్ల ఏసిపి ప్రసాదరావు కక్షపూరితమైన విధానాన్ని నిరసిస్తూ వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మైలవరం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వద్ద ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి , నాయకులు విలేకరుల సమావేశం ఎంఎస్పి జాతీయ నాయకులు మంద వెంకటేశ్వరరావు మాదిగ ఎంఎస్పి రాష్ట్ర నాయకులు కోట డానియల్ మాదిగ ఎంఎస్పి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు మంద పిచ్చయ్య మాదిగ ఎమ్మార్పీఎస్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు ఆదూరి నాగమల్లేశ్వరరావు మాదిగ ఈ సమావేశంలో మాట్లాడుతూ విస్సన్నపేట వికాస్ కాలేజీలో డి ఫార్మసీ చదువుతున్న మల్లాది కార్తీక్ ఏప్రిల్ 7న ఉరి పెట్టుకొని అనుమానాస్పదంగా మృతి పై విస్సన్నపేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగింది ఈ విషయంపై మృతుడు తండ్రి మల్లాది బాలకృష్ణ మైలవరంలో ఏసీపీ ప్రసాద్ రావు ని కార్యాలయంలో కలిసినప్పుడు ఏసిపి ఒక్కసారిగా అహంకారపూరితంగా అరే నువ్వు



డబ్బులు దేంగటానికి వచ్చావు నీ అంతు చూస్తా అని దుర్భాషలాడటం చాలా దారుణమని గతంలో మరుసుమల్లి లో ఒక హత్య సంఘటన గంపలగూడెం,లో విగ్రహం పగలగొట్టారని తిరువూరు సిఐ చావ కొట్టిన విధానం రెడ్డిగూడెం ఎస్సై మాదిగల పట్ల వ్యవహరించిన తీరుపై మేము ఆందోళన చేసినప్పుడు ఎమ్మార్పీఎస్ నాయకులు పట్ల ఏసిపి దుర్మార్గంగా వ్యవహరించాలని వెంటనే ఏసీపీపై ప్రసాదరావు ని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు ఈరోజునే సిపి కి ఎస్సీ కమిషన్ చైర్మన్ కి స్థానిక శాసనసభ్యులకు ఏసిపి పై ఫిర్యాదు చేస్తామని వెంటనే స్పందించి శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో మైలవరం కేంద్రంగా జిల్లావ్యాప్తంగా ఉద్యమానికి పిలుపునిస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమాలు మొండితోక విజయ్ మాదిగ ఎంఎస్పి మైలవరం ఇన్చార్జి బండారి శరత్ మాదిగ ఎమ్మార్పీఎస్ మైలవరం రీఛార్జి ఇంకొల్లు జమలయ మాదిగ ఎంఎస్పి మైలవరం కో ఇన్చార్జ్ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి నాయకులు కొంగల రామారావు మాదిగ మండల శేఖర్ మాదిగ పత్తిపాటి యేసు రత్నం మాదిగ ఓలేటి ఏసు మాదిగ సంగిపు అంజియ మాదిగ దూర్ దాసు మాదిగ మట్టకోయ సుందరం మాదిగ మల్లాది బాలకృష్ణ మాదిగ మేకల రాంబాబు మాదిగ ఇసంపల్లి దాసు మాదిగ పేరబత్తుల కాంతారావు మాదిగ తదితరులు పాల్గొన్నారు



# లక్కీ ఛార్మ్ త్రిష

## ముగ్గురు హీరోలకు బ్లాక్ బస్టర్లు

సౌత్ ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న త్రిష మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. వరుసగా కోలీవుడ్ స్టార్ హీరోల కెరీర్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల్లో ఆమె భాగం కావడం ఇప్పుడు అభిమానుల మధ్య ఆసక్తికర చర్చకు దారితీసింది. దీంతో 'త్రిష లక్కీ ఛార్మ్' అంటూ నెటిజన్లు సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారు. ఇటీవల ఓ అభిమాని సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ విపరీతంగా వైరల్ అయింది. ప్రముఖ హీరోలు అజిత్, విజయ్, సూర్య కెరీర్‌లలో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల్లో త్రిష హీరోయిన్‌గా నటించడాన్ని ప్రస్తావిస్తూ.. 'వారి బ్లాక్‌బస్టర్ విజయాల వెనుక త్రిష మ్యాజిక్ ఉంది' అంటూ రాసుకొచ్చాడు. ఈ పోస్టును త్రిష తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేస్తూ హార్ట్ ఎమోజీతో స్పందించింది. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. ప్రస్తుత తమిళనాడు సీఎం, కోలీవుడ్ స్టార్ హీరో విజయ్‌తో త్రిష నటించిన 'లియో' సినిమా భారీ విజయాన్ని అందుకుంది. దర్శకుడు లోకేష్ కనగరాజ్ తెరకెక్కించిన ఈ చిత్రం 2023లో విడుదలై ప్రపంచవ్యాప్తంగా రూ.600 కోట్లకు పైగా వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ వర్గాలు తెలిపాయి. విజయ్ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా ఇది నిలిచింది. కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ కుమార్ నటించిన 'గుడ్ బ్యాడ్ అగ్లీ' కూడా భారీ విజయాన్ని అందుకుంది. దర్శకుడు అధిక్ రవిచంద్రన్ రూపొందించిన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో త్రిష కీలక పాత్రలో నటించింది. ఈ సినిమా రూ.248 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించి అజిత్ కెరీర్‌లో బి÷-గగెస్ట్ హిట్‌గా నిలిచినట్లు ప్రచారం జరుగుతోందికొంతకాలంగా సరైన హిట్ కోసం ఎదురుచూస్తున్న సూర్య.. 'కరుప్పు' (తెలుగులో 'వీరభద్రుడు') సినిమాతో మళ్లీ విజయాన్ని అందుకున్నాడు. ఈ చిత్రంలో త్రిష లాయర్ ప్రీతి పాత్రలో నటించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ.300 కోట్లకు పైగా వసూళ్లు సాధించినట్లు సమాచారం. ఈ మూడు సినిమాల్లో కూడా త్రిష హీరోయిన్‌గా కనిపించడంతో.. అభిమానులు ఆమెను 'లక్కీ ఛార్మ్' అంటూ ప్రశంసిస్తున్నారు. ప్రస్తుతం త్రిష తెలుగులో మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 'విశ్వంభర' చిత్రంలో నటిస్తోంది. దర్శకుడు వశిష్ట మల్లిడి తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో ఆమె అవని పాత్రలో కనిపించనుంది. ఈ సినిమాపై కూడా ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

### పర్సెంటేజీల కోసం ఎగ్జిబిటర్ల ఆందోళన

# రంగంలోకి దిగిన మెగాస్టార్ చిరంజీవి

తెలుగు చలనచిత్ర పరిశ్రమలో గత కొన్ని రోజులుగా నిర్మాతలు, సింగిల్ స్క్రీన్ థియేటర్ల యజమానుల మధ్య కొనసాగుతున్న వివాదం ఇప్పుడు కీలక దశకు చేరుకుంది. కలెక్షన్లలో వాటా పద్ధతి అయిన 'పర్సంటేజ్ సిస్టమ్' అంశంపై రెండు వర్గాల మధ్య విభేదాలు మరింత తీవ్రరూపం దాల్చడంతో, పరిశ్రమలో పెద్దదిక్కుగా భావించే మెగాస్టార్ చిరంజీవి ఈ సమస్య పరిష్కారానికి స్వయంగా ముందుకు వచ్చారు. తెలంగాణ ఎగ్జిబిటర్ల అసోసియేషన్ ప్రతినిధులు చిరంజీవిని ఆయన నివాసంలో కలవనున్నట్లు సమాచారం.

ప్రస్తుతం మల్టీప్లెక్స్‌లలో కలెక్షన్ల ఆధారంగా పర్సంటేజ్ షేరింగ్ విధానం అమలులో ఉంది. అయితే సింగిల్ స్క్రీన్ థియేటర్ల విషయంలో మాత్రం పాత ఫిక్స్‌డ్ రెంటల్ పద్ధతినే కొనసాగిస్తున్నారని ఎగ్జిబిటర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ల ప్రభావం, విద్యుత్ ఛార్జీల పెరుగుదల, నిర్వహణ ఖర్చులు భారీగా పెరగడం వల్ల సింగిల్ స్క్రీన్ థియేటర్ల పరిస్థితి క్లిష్టంగా మారిందని వారు చెబుతున్నారు. సినిమా హిట్ అయినా, ఫ్లాప్ అయినా ఒకే స్థిర అద్దె చెల్లించాల్సి రావడం తమపై తీవ్ర ఆర్థిక భారం పెడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేశంలోని ఇతర ప్రాంతాల్లో అమలవుతున్న రెవెన్యూ షేరింగ్ విధానాన్ని ఇక్కడ కూడా అమలు చేయాలని ఎగ్జిబిటర్లు డిమాండ్ చేస్తున్నారు. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు సనా దర్శకత్వంలో తెరకెక్కిన భారీ చిత్రం 'పెద్ది' జూన్ 4న



ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సినిమా విడుదల సమయంలోనే ఈ వివాదం మరింత వేడెక్కింది. 'పెద్ది' సినిమా నుంచే పర్సంటేజ్ విధానం అమలు చేయాలని తెలంగాణ ఎగ్జిబిటర్ల సంఘం పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది. పరిశ్రమలో పెద్ద సమస్యలు వచ్చినప్పుడు ముందుండి స్పందించే వ్యక్తిగా చిరంజీవికి ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈసారి ఒకవైపు తన కుమారుడు రామ్ చరణ్ సినిమా విడుదల, మరోవైపు థియేటర్ల యజమానుల సమస్యలు ఉండటంతో ఆయన ఈ వివాదంలో జోక్యం చేసుకున్నట్లు తెలుస్తోంది

# 'ధురంధర్' హీరోపై బ్యాన్... కారణమిదే!



ప్రస్తుతం బాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా నిలిచిన చిత్రం 'డాన్3'. రణ్‌వీర్‌సింగ్ కథానాయకుడిగా ఫర్హాన్ అక్తర్ దర్శకత్వంలో ఈ మూవీ పట్టాలెక్కాల్సి ఉంది. అయితే, అనివార్య కారణాలతో ఈ మూవీ నుంచి రణ్‌వీర్ తప్పుకొన్నట్లు గత కొంతకాలంగా వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. అధికారికంగా మాత్రం ఎక్కడా ప్రకటించలేదు. ఈ క్రమంలో 'డాన్3' నుంచి తప్పుకొన్నందుకు గానూ రణ్‌వీర్ సింగ్‌పై నిషేధం విధించినట్లు ఫెడరేషన్ ఆఫ్ వెస్టర్న్ ఇండియా సినీ ఎంప్లాయిస్ ప్రకటించింది. చివరి నిమిషంలో ఆ సినిమా నుంచి తప్పుకోవడంతో నిర్మాతకు రూ.40 కోట్ల నష్టం వాటిల్లిందని ఫర్హాన్ అక్తర్ గతంలో తెలిపారు. రణవీర్ సింగ్ ఆ సినిమా స్క్రిప్ట్‌పై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో సోమవారం తాజాగా ఆయనపై నిషేధం విధిస్తున్నామని, ఏ సినిమాల్లోకీ తీసుకోవద్దని FWICE ప్రకటించింది.బాలీవుడ్ అగ్ర హీరోలు అమితాబ్ బచ్చన్, షారుక్‌ఖాన్‌లకు 'డాన్' సిరీస్ సినిమాలు అద్భుతమైన విజయాలను అందించాయి. అదే కోవలో వస్తున్న సినిమా కావడంతో దీనిపై అంచనాలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో రణ్‌వీర్ వైదొలిగిన తర్వాత ఆయన స్థానంలో హృతిక్ నటించనున్నట్లు వార్తలు వచ్చాయి. అయితే ఆ నటుడి టీమ్ వాటిని ఖండించింది. ఈ ప్రాజెక్ట్ కోసం తనను ఎవరూ సంప్రదించలేదని హృతిక్ ఇటీవల స్పష్టంచేశారు. ఇప్పుడు రణ్‌వీర్‌పై FWICE నిషేధం విధించడంతో 'డాన్ 3'లో ఎవరు నటిస్తారనే దానిపై సందిగ్ధత నెలకొంది.

### రామాయణ్‌కు హన్స్ జిమ్మర్ సంగీతం అదనపు ఆకర్షణ

# రామాయణ విదేశీయులను కూడా ఆకర్శించడం ఖాయం

హిందీలో తెరకెక్కుతున్న ఇతిహాసం 'రామాయణ్'పై సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నితీశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ అద్భుత కావ్యం ఇండియాకే పరిమితం కాకుండా అంతర్జాతీయ స్థాయిలో ఆకట్టుకుంటుందని ఏఆర్ రెహమాన్ అన్నారు. దాదాపు 4000 కోట్ల బ్జడెట్‌తో నమిత్ మల్హోత్ర ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ గొప్ప ఇతిహాసం గురించి ప్రపంచానికి తెలియాలన్నదే నిర్మాతగా ఆయన ఆకాంక్ష. ఈ చిత్రానికి సంగీత దర్శకుడు ఏ.ఆర్ రెహమాన్‌తోపాటు హాలీవుడ్ దిగ్గజ సంగీత దర్శకుడు






హన్స్ జిమ్మర్ కూడా పని చేస్తున్నారు. ఆయనతో కలిసి పనిచేయడం గురించి తాజా ఇంటర్వ్యూలో రెహమాన్ మాట్లాడారు. 'సంగీత ప్రపంచంలో ఆయనది విభిన్నమైన శైలి. మాది గొప్ప స్నేహం. మన దేశానికి, సంస్కృతికి సంబంధించిన గొప్ప చిత్రానికి మేమిద్దరం కలిసి పనిచేయడం ఆనందంగా ఉంది. జిమ్మర్‌ను ఈ కథలోకి తీసుకురావడం అంటే ఆయన్ను ప్రపంచ వేదికపై ఒక అంబాసిడర్‌లా నిలబెట్టడమే. ఆయన వల్ల విదేశీయులు కూడా ఈ చిత్రాన్ని వీక్షిస్తారు. ఒక భారతీయ సినిమాకు హన్స్ జిమ్మర్ ఎలాంటి సంగీతాన్ని అందించారో చూడాలనే ఎగ్జైట్‌మెంట్‌తో ఫారినర్స్ సైతం థియేటర్లకు వస్తారు. అలాంటి గొప్ప కళాకారుడితో కలిసి పనిచేయడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నా. అలాగే నా కెరీర్‌లోనే ఇదిఅతిపెద్ద చిత్రాల్లో ఒకటి. కథ పరంగానే కాదు అన్నివిధాలా ఇది ఆడియన్స్‌ను అలరిస్తుంది. ఈ సినిమా కోసం ఉపయోగిస్తున్న లేటెస్ట్ టెక్నాలజీ సినిమాను నెక్ట్స్ లెవల్‌కి తీసుకెళ్తుంది. దీని ట్రైలర్ త్రీడీలో చూశాను. అద్భుతంగా ఉంది. ఇండియాలోనే కాకుండా గ్లోబల్ స్థాయిలో ఈ తరహా చిత్రాన్ని చూడలేదు. త్రీడీ విజువల్స్, మ్యూజిక్ ప్రేక్షకులను కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తాయి. ఇది భారతదేశంలో రూపొందిన అద్భుతమైన చిత్రాలలో ఒకటిగా నిలుస్తుంది' అని రెహమాన్ అన్నారు. రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా నటిస్తున్న ఈ చిత్రం రెండు పార్టులుగా తెరకెక్కుతోంది. మొదటి పార్టు ఈ ఏడాది దీపవళికి విడుదల కానుంది. ఇందులో యశ్ రావణాసురుడిగా, సన్నీ డియోల్ హనుమంతుడిగా కనిపించనున్నారు.



### ఇక కొత్త సినిమా ఏదైనా ఐదు షోలు..

# సీఎం విజయ్ కీలక నిర్ణయం

సినీ నటుడు, తమిళనాడు కొత్త ముఖ్యమంత్రి విజయ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో విడుదలయ్యే ప్రతి తమిళ సినిమా మొదటి వారం ఐదు షోలను ప్రదర్శించుకునేలా అనుమతి ఇచ్చారు. సోమవారం జరిగిన మంత్రి వర్గ సమావేశంలో సీఎం విజయ్ పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సినీ పరిశ్రమలో నెలకొన్న సమస్యలను పరిష్కరించే దిశగా కూడా అడుగులు వేశారు. ఇప్పటివరకూ కొత్తగా ఏ సినిమా విడుదలైనా అదనపు షోలు ప్రదర్శించుకోవాలంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. అందుకు చిత్ర బృందాలు ముందుగానే ప్రభుత్వం, అధికారులకు అర్జీ పెట్టుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు ఎలాంటి అనుమతులు అక్కర్లేకుండానే, నిర్మాత, డిస్ట్రిబ్యూటర్, థియేటర్ యజమానుల నిర్ణయం మేరకు అదనపు షోలను ప్రదర్శించుకోవచ్చు.రాష్ట్రంలో చిన్న, సన్నకారు రైతులకు ఊరటనిస్తూ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. సహకార బ్యాంకుల ద్వారా రూ.50 వేల వరకు తీసుకున్న పంట రుణాలను పూర్తిగా మాఫీ చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా 14.22 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరనుంది.

**–సత్వర న్యాయం జరిగింది..**

తమిళనాడులోని విలాతికుళం ప్రాంతానికి చెందిన 12వ తరగతి విద్యార్థిని హత్యాచారం కేసులో పోక్సో కోర్టు కీలక తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. ఈ కేసులో దోషిగా తేలిన ధర్మ మునీశ్వరన్‌కు రెండు మరణ శిక్షలు విధించింది. బాధితులకు త్వరగా న్యాయం జరగడం ఆహ్వానించదగ్గ పరిణామమని విజయ్ అన్నారు. మూడు నెలల్లోనే నిందితుడికి శిక్షపడిందని, మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

### కేన్ ఫెస్టివల్‌లో మెరిసిన ఐశ్వర్య

# ట్రోలర్స్‌కు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చిన కంగనా

ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా బాలీవుడ్ నటి ఐశ్వర్యారాయ్ తన ఫ్యాషన్ లుక్‌తో కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో మెరిశారు. తన కుమార్తె ఆరాధ్యతో కలిసి రెడ్ కార్పెట్‌పై యలొలికించారు. అయితే, ఐశ్వర్య లుక్‌పై నెట్టింట కొన్ని విమర్శలు ఎదురవుతున్నాయి. వీటిపై ఐష్ స్పందించనప్పటికీ.. నటి కంగనా రనౌత్ ట్రోలర్స్‌కు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఐశ్వర్య ఫొటోను తన ఇన్‌స్టాలో షేర్ చేసిన కంగన అద్భుతంగా ఉన్నారని ప్రశంసించారు. 'ఫ్యాషన్, స్టైల్ అనేది ఎవరికి నచ్చినట్లు వారు ఎంపిక చేసుకునేవి. వారి ఇష్టానికి, సౌకర్యానికి తగినట్లు ఉంటాయి. ఈ విషయంలో ఏ మహిళ కూడా ఎవరికీ ఎటువంటి వివరణ ఇచ్చుకోవాల్సిన అవసరం లేదు. కేన్స్‌లో ఐశ్వర్య అద్భుతంగా ఉన్నారు. ఆమెను మరేదైనా స్టైల్‌లో చూడాలనుకునే వారు మొదట మీ దగ్గర ఏముందో ప్రపంచానికి చూపించవచ్చు కదా?.. అయినా.. రెడ్‌కార్పెట్‌పై ఎప్పుడూ యువ నటీమణులే ఉండరు. ఇలా 50 ఏళ్లలో ఉన్నవారు





కూడా మెరుస్తారు. వారిని చూడడం మీకు అలవాటు లేకపోతే ఇకనైనా అలవాటు చేసుకోండని తన పోస్ట్‌లో కంగనా రాసుకొచ్చారు. ప్రతిష్ఠాత్మక కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ ఫ్రాన్స్‌లోని కేన్స్‌లో మే 12 నుంచి 23 వరకూ సందడిగా జరిగింది. ప్రముఖ డిజైనర్ అమిత్ అగర్వాల్ ప్రత్యేకంగా రూపొందించిన 'లుమినారా' అనే డీప్ సెర్-బ్లూ గౌన్‌లో ఐశ్వర్య రెడ్ కార్పెట్‌పై నడిచి అందరినీ మంత్రముగ్ధుల్ని చేశారు. రెండోరోజు వైట్ డ్రెస్‌తో ఫొటోలకు పోజులిచ్చారు.




# నెట్‌ఫ్లిక్స్‌లో ధనుష్ కర

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'కర' సినిమా కోసం ఎదురుచూస్తున్న అభిమానులకు ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ అదిరిపోయే వార్త చెప్పింది. థియేటర్లలో సందడి చేసిన ఈ చిత్రం ఇప్పుడు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే మే 28 నుంచి స్ట్రీమింగ్ ప్రారంభం కానుందనే వార్తలు వినిపించగా.. తాజాగా ఈ మూవీ భాషల విషయంలో కూడా అధికారిక స్పష్టత వచ్చింది. కేవలం తమిళ ప్రేక్షకులకు మాత్రమే కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న సినీ అభిమానులను దృష్టిలో పెట్టుకుని నెట్‌ఫ్లిక్స్ ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో అందుబాటులోకి తీసుకురానుంది. తమిళంతో పాటు తెలుగు, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో కూడా ఈ సినిమాను మే 28 నుంచి స్ట్రీమింగ్ చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. దీనికి సంబంధించిన పోస్టర్‌ను సోషల్ మీడియా వేదికగా విడుదల చేయడంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. దర్శకుడు విఘ్నేష్ రాజా తెరకెక్కించిన ఈ చిత్రంలో ధనుష్ 'కరస్వామి' అనే లోకల్ దొంగ పాత్రలో కనిపించనున్నారు. తన కెరీర్‌లో మరో డిఫరెంట్ క్యారెక్టర్‌తో ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు ప్రయత్నించారు. సినిమా థియేటర్లలో విడుదలైనప్పుడు మిక్స్‌డ్ రెస్పాన్స్ వచ్చినప్పటికీ.. ధనుష్ నటన, యాక్షన్ సన్నివేశాలు మంచి ప్రశంసలు అందుకున్నాయి.

**GAYATHRI NEWS Publisher, Editor and Owned by Maddineni Nageswara Rao,** SVN Colony, Guntur, Andhra Pradesh - 522006. PRGI Reg No - APTEL/26/A3646 .. Cell No - 7386045673 ..... Printed ESHAGNA SERVICE INDIA PRIVATE LIMITED SVN Colony, Guntur, Andhra Pradesh - 522006 ..Cell No - 7386045673.